ఆ భూములు అటవీ శాఖవే!

- దేవునూరు భూములపై ఎమ్మెల్యే కడియం ఒప్పుకోలు
- భూముల జాయింట్ సర్వేపై ఇంకా పీసీసీఎఫ్ అనుమతి రాలేదు
- అందుకే ఆ భూముల్లోకి వెళ్లిన వారిని అటవీ శాఖ అడ్డుకుంటున్నది
- రెవెన్యూ, అటవీ శాఖల మధ్య సమన్వయం లేకనే సమస్యలు
- రైతులు నా వద్దకు వస్తేనే హనుమకొండ కలెక్టర్‌కు చెప్పాను
- విలేకరుల సమావేశంలో కడియం



వరంగల్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): హనుమకొండ జిల్లాలోని దేవునూరు ఇనుపరాతి గుట్ట భూములు అటవీ శాఖవేనని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అంగీకరించారు. దేవునూరు ఇనుపరాతి గుట్ట భూములు అటవీ శాఖ పరిధిలో ఉన్నందునే అందులోకి వెళ్లేవారిని ఆ శాఖ అడ్డుకుంటున్నదని 'నమస్తే తెలంగాణ' పేర్కొన్న విషయాన్ని ఆయన ఒప్పుకొన్నారు. అటవీశాఖ ఆధీనంలోని భూముల్లో రైతుల పట్టా భూములు ఉన్నాయనేది తేల్చేందుకు ఇటీవల నిర్వహించిన సర్వే నివేదికకు అటవీ శాఖ ముఖ్య ప్రధాన సంరక్షణ అధికారి(పీసీసీఎఫ్) ఇంకా ఆమోదం తెలపలేదని కడియం ధ్రువీకరించారు. రైతుల పట్టా భూముల విషయమై రెవెన్యూ, అటవీ శాఖలు ఇటీవల చేపట్టిన సంయుక్త సర్వే నివేదికను జిల్లా అధికారులు పీసీసీఎఫ్‌కు పంపించారని తెలిపారు. అయితే, దీనిపై తుది అనుమతులు రాకపోవడంతోనే ఆ భూముల్లోకి ఎవరూ రాకుండా అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారని వివరణ ఇచ్చారు. రెవెన్యూ, అటవీ శాఖల మధ్య సమన్వయం లేకనే రైతులు ఇబ్బందులు పడుతున్నారని అధికార పార్టీలోకి ఫిరాయించిన కడియం తెలిపారు. దేవునూరు ఇనుపరాతి గుట్ట అటవీ భూములను ఇటీవల కొందరు బుల్డోజర్లతో చదును చేసేందుకు ప్రయత్నించడం, అటవీశాఖ అధికారులు వారిని అడ్డుకోవడం, ఆ తర్వాత జరిగిన పరిణామాలపై 'నమస్తే తెలంగాణ'లో వరుస కథనాలు వచ్చిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో తనపై వచ్చిన ఆరోపణలపై వివరణ ఇచ్చేందుకు కడియం శ్రీహరి హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ధర్మసాగర్ మండలం దేవునూరు, ముప్పారం, నారాయణగిరి గ్రామాలకు చెందిన రైతులు ఆ భూముల విషయమై తనను ఆశ్రయించి న్యాయం చేయాలని కోరారని తెలిపారు. అందువల్ల తాను హనుమకొండ జిల్లా కలెక్టర్‌కు ఈ విషయమై లేఖ రాశానని అంగీకరించారు. రెవెన్యూ, అటవీ శాఖల ఆధ్వర్యంలో జాయింట్ సర్వే చేసి, హద్దులు నిర్ధారించి రైతులకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను తాను కోరానని చెప్పారు. రెండు శాఖల సంయుక్త సర్వే నివేదికలో 3,955 ఎకరాలు అటవీ శాఖ ఆధీనంలో ఉన్నదని తేలినట్టు కడియం అంగీకరించారు. జాయింట్ సర్వే నివేదికలో 23 మంది రైతులకు 43.38 ఎకరాల పట్టా భూమి ఉన్నట్టు తేలిందని, దీనిపై పీసీసీఎఫ్ నుంచి రావాల్సిన అనుమతి పెండింగ్‌లో ఉన్నదని వివరణ ఇచ్చారు. రైతుల పట్టా భూములుగా పేర్కొంటున్న 43.38 ఎకరాలు.. అటవీ శాఖ ఆధీనంలో ఉండటంతో పీసీసీఎఫ్ నుంచి అనుమతి వచ్చే వరకు అందులోకి ఎవరూ రావొద్దని ఆ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారని చెప్పారు. రెవెన్యూ, అటవీ శాఖల సమన్వయ లేమితో మొదలైన సమస్యను ప్రభుత్వపరంగా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు.

ఊసరవెల్లి కడియం ముసుగు తొలగిస్తాం

- ఆంధ్రా అల్లుడితో కలిసి దోపిడీ
- బినామీల పేరిట భూములు కొనుగోలు
- అటవీ భూములు కొల్లగొట్టేందుకు యత్నం
- ఊసరవెల్లి ఎమ్మెల్యే వ్యాఖ్యలపై పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫైర్

సిద్దిపేట జిల్లా చేర్యాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, ఏప్రిల్ 8 : పార్టీలు మారుతున్న ఊసరవెల్లి ఎమ్మెల్యే కడియం శ్రీహరి నీతి లేకుండా మాట్లాడుతున్నాడని, త్వరలో ఆయన ముసుగు తొలిగిస్తామని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆంధ్రా అల్లుడితో ఆయన చేయిస్తున్న దోపిడీని ప్రజలే బట్టబయలు చేస్తారని చెప్పారు. సిద్దిపేట జిల్లా చేర్యాలలో మంగళవారం బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సంబంధించి చేర్యాల టౌన్, చేర్యాల, కొమురవెల్లి మండలాల ముఖ్య కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ నెల 27న ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే సభ చరిత్రలో నిలిచిపోతుందని చెప్పారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇటీవల తనపై చేస్తున్న వ్యాఖ్యలపై పల్లా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేవునూరు అటవీ భూముల పక్కన ఎమ్మెల్యే కడియం తన బినామీలతో భూములు కొనుగోలు చేయిస్తున్నారని ఆరోపించారు. ముప్పారంలో మరో 24 ఎకరాలు ఇటీవల కొనుగోలు చేసి, సదరు భూములకు వెళ్లేందుకు రోడ్లు నిర్మించడమే కాకుండా ప్రజలను బెదిరింపులకు గురి చేస్తున్నాడని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే అల్లుడు పోలీస్, రెవెన్యూ, అటవీశాఖల అధికారులను గుప్పెట్లో పెట్టుకుని కబ్జాలు చేస్తున్నారని మండిపడ్డారు. తన గురించి మాట్లాడే అర్హత సదరు కడియంకు లేదని చెప్పారు.

చరిత్రలో నిలిచేలా రజతోత్సవ సభ

మొదటిపేజీ తరువాయి...

హైదరాబాద్ నందినగర్‌లోని తన నివాసంలో మీడియాతో చిట్‌చాట్ చేశారు. ప్రాంతీయ పార్టీలు 25 ఏండ్లు పూర్తిచేసుకోవడం గొప్ప విషయమని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో టీడీపీ తర్వాత బీఆర్ఎస్‌కే ఈ ఘనత దక్కిందని చెప్పారు. 'బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రత్యేక కమిటీలను నియమించుకొని గొప్పగా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. పార్టీ అధినేత కేసీఆర్ ఇప్పటికే 119 నియోజకవర్గాల నేతలతో సమావేశాలు నిర్వహించి సభ విజయవంతం కోసం దిశానిర్దేశం చేశారని చెప్పారు. సభ నిర్వహణ అనుమతుల కోసం ఇప్పటికే డీజీపీతో మాట్లాడామని తెలిపారు. స్థానిక నాయకులు సైతం ఏసీపీని కలిశారని వెల్లడించారు. సభ నిర్వహణ రోజున సెలవుదినమని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని పేర్కొన్నారు. 'మూడు వేల బస్సుల కోసం మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి నేతృత్వంలో ఆర్టీసీ ఎండీకి విన్నవించినం. ఇందుకు సంబంధించి పార్టీ నుంచి డబ్బులు కూడా చెల్లించినం. మా పార్టీ చరిత్రలోనే అతి పెద్ద సభ అవుతుంది' అని వివరించారు. ఒకవేళ సభకు పర్మిషన్ ఇవ్వకుంటే కోర్టును ఆశ్రయిస్తామని స్పష్టంచేశారు. ఎల్కతుర్తిలో పార్టీ నిర్వహించే బహిరంగ సభకు పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు వస్తారని ఆశిస్తున్నామని, వరంగల్ పరిసర ప్రాంతాల్లో పార్టీ ఇప్పటివరకు నిర్వహించిన ప్రతీ సభ అద్భుతమైన విజయం సాధించిందని, ఎల్కతుర్తి సభ కూడా అంచనాలకు మించి విజయం సాధిస్తుందన్న ధీమా వ్యక్తంచేశారు.

డిజిటల్ రూపంలో సభ్యత్వ నమోదు

బహిరంగ సభ ముగిసిన తర్వాత మే నెల తొలి వారంలోనే పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడతామని కేటీఆర్ తెలిపారు. ఈసారి గతానికి భిన్నంగా డిజిటల్ రూపంలో సభ్యత్వ నమోదు ఉంటుందని వెల్లడించారు. గతంలో సభ్యత్వ పుస్తకాలు అచ్చు వేయించేవారమని, ఈసారి యాప్ తీసుకొస్తున్నామని, డిజిటల్ మాధ్యమంలో సభ్యత్వ నమోదు ఉంటుందని వివరించారు. సభ్యత్వ నమోదు అనంతరం పార్టీ నిర్మాణంపై దృష్టి సారిస్తామని, విద్యార్థి విభాగం, గ్రామ, వివిధ స్థాయి కమిటీల నిర్మాణం పూర్తిచేస్తామని పేర్కొన్నారు. ఈ ఏడాది అక్టోబర్‌లో పార్టీ అధ్యక్షుడిని ఎన్నుకుంటామని చెప్పారు. మధ్యలో స్థానిక సంస్థల ఎన్నికలు వస్తే ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్టు వెల్లడించారు. 32 జిల్లాల్లో పార్టీ కార్యాలయాలు ఉన్నాయని తెలిపారు. కమిటీల ఎన్నిక ప్రక్రియను పూర్తిచేసిన తరువాత జిల్లాలవారీగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. జిల్లా స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించే వారికి (రిసోర్స్ పర్సన్స్) తొలుత హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో శిక్షణ ఇస్తామని తెలిపారు.

బీఆర్ఎస్ నేత పాడె మోసిన నిరంజన్‌రెడ్డి

రేవల్లి, ఏప్రిల్ 8 : వనపర్తి జిల్లా రేవల్లి మండలం కేశంపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రఘురామారావు (60) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి గ్రామానికి చేరుకొని రామారావు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రఘురామారావు లేకపోవడం ఈ ప్రాంత ప్రజలకు, పార్టీకి.. ముఖ్యంగా తనకు తీరని లోటని నిరంజన్‌రెడ్డి అన్నారు. వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొని రఘురామారావు పాడె మోశారు. ఆయనతోపాటు మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్ విజన్ దేశానికే ఆదర్శం

- కాంగ్రెస్ పాలన సమస్యలమయం
- రజతోత్సవ సభకు తరలిరావాలి
- మాజీ మంత్రి తలసాని పిలుపు
- తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ముఖ్యనేతలతో సమావేశం

తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ముఖ్యనేతల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కేసీఆర్ ఆదర్శవంతమైన పాలన అందించారని కొనియాడారు. బీఆర్ఎస్ పార్టీ 25వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరగనున్న రజతోత్సవ సభకు గ్రేటర్ హైదరాబాద్ నుంచి గులాబీ కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. అందులో భాగంగా తెలంగాణ భవన్‌లో మంగళవారం ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, శంభీపూర్ రాజు, దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, మాధవరం కృష్ణారావు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. కేసీఆర్ విజన్ దేశానికే ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చడానికి బీఆర్ఎస్ పార్టీని స్థాపించి, అనేక పోరాటాలు చేసి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ గొప్ప పరిపాలనాదక్షుడని పేర్కొన్నారు. ఉద్యమ సారథే తొలి సీఎంగా బాధ్యతలు చేపట్టడంతో తెలంగాణ వేగంగా అభివృద్ధి జరిగిందని తెలిపారు. పదేండ్లలో జరిగిన అభివృద్ధి కేసీఆర్ దూరదృష్టికి నిదర్శనమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ 25 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా వరంగల్‌లో ఈనెల 27న జరగనున్న భారీ బహిరంగ సభకు గ్రేటర్ నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివెళ్లడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. బీఆర్ఎస్ వ్యవస్థాపక పండుగ తమ ఇంట్లో పండుగగా ప్రతీ కార్యకర్త భావిస్తున్నట్టు పేర్కొన్నారు. వరంగల్ సభ విజయవంతం చేయడంలో భాగంగా గ్రేటర్‌లోని కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. నేడు, రేపు గోషామహల్, నాంపల్లి, కార్వాన్, ఖైరతాబాద్‌లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్సీ శ్రవణ్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం జరుగుతుందని వెల్లడించారు. 13న నియోజకవర్గాల స్థాయిలో మీటింగ్ ఉంటుందని, 20న తెలంగాణ భవన్‌లో జనరల్ బాడీ మీటింగ్ ఉంటుందని చెప్పారు. 27న ప్రతీ డివిజన్‌లో గులాబీ జెండా ఎగురవేసి వరంగల్‌కు బయల్దేరనున్నట్టు పేర్కొన్నారు.

కరీంనగర్‌లో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల

కాంగ్రెస్ పాలన గాడి తప్పింది

- ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలననే కోరుకుంటున్నరు
- బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీగా జనసమీకరణ
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన గాడి తప్పిందని, అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ ఏడాదిన్నర కాలంగా ప్రజలకు చేసిందేమీలేదని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ విమర్శించారు. ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు జనసమీకరణపై మంగళవారం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఆ పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో జీవించారని, కాంగ్రెస్ పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, రాష్ట్ర ప్రజలు మరోసారి కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని చెప్పారు. పార్టీ ఆవిర్భవించి 25 ఏండ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఈ నెల 27న వరంగల్ జిల్లాలో నిర్వహిస్తున్న రజతోత్సవ సభకు కరీంనగర్ నియోజకవర్గం నుంచి 10 వేల మందికి పైగా జనాన్ని తరలించాలని కార్యకర్తలు, నాయకులకు సూచించారు.

కేసీఆర్ లేకపోతే తెలంగాణ వచ్చేది కాదు

- సభను విజయవంతం చేయాలి
- మహేశ్వరం ఎమ్మెల్యే సబిత

రంగారెడ్డి, (నమస్తే తెలంగాణ) ఏప్రిల్ 8: కేసీఆర్ లేకపోతే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యేదికాదని మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ రంగారెడ్డి జిల్లా సన్నాహక సమావేశం శంషాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని గుర్తుచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ నెల 27న వరంగల్‌లో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు రంగారెడ్డి జిల్లా నుంచి పార్టీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. సభకు తరలివచ్చే వారికోసం బస్సులు సిద్ధంగా ఉంటాయని, ప్రజలను సభకు తరలించడంతోపాటు తిరిగి వారిని ఇంటికి చేర్చే బాధ్యతను ఆయా గ్రామాల నాయకులు తీసుకోవాలని కోరారు.



శంషాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

సభను విజయవంతం చేయాలని వాల్‌రైటింగ్స్

వినూత్న ప్రచారం చేపట్టిన కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 8 : బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరుతూ కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల మంగళవారం జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం యూసుఫ్‌నగర్‌లో గోడలపై వాల్ రైటింగ్ చేసి వినూత్న ప్రచారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వరంగల్ జిల్లాలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆ పార్టీ నాయకులు వనరులను దోచుకుంటూ తెలంగాణ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. నియోజకవర్గం నుంచి 10వేల మందితో సభకు వెళ్లనున్నట్టు తెలిపారు.

బీఆర్ఎస్ దళిత నాయకుడి అరెస్ట్

సోషల్‌మీడియాలో కడియంపై పోస్టు

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 8 : స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని జనగామ న్యూస్ అఫీషియల్ అనే సోషల్ మీడియా వాట్సాప్ గ్రూప్‌లో అసభ్య పదజాలంతో విమర్శించారన్న కారణంతో జనగామకు చెందిన బీఆర్ఎస్ దళిత నాయకుడు తిప్పారపు విజయ్‌ని మంగళవారం అర్బన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. డాక్టర్ గదరాజు చందు అనే మరో నాయకుడిపై కూడా కేసు నమోదు చేశారు. జిల్లా యువజన కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు క్రాంతి కుమార్ ఫిర్యాదు మేరకు బీఆర్ఎస్ నాయకులిద్దరిపై కేసు నమోదు చేసినట్టు సీఐ దామోదర్‌రెడ్డి తెలిపారు.

జైలుకు పంపడం పిరికిపంద చర్య : ఎమ్మెల్యే పల్లా

బీఆర్ఎస్ జనగామ పట్టణ దళిత నాయకుడు తిప్పారపు విజయ్‌ని అక్రమంగా అరెస్ట్ చేసి జైలుకు పంపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపడం పిరికిపంద చర్య అని విమర్శించారు.

ఎస్‌బీఐ లేదా! హెచ్‌ఎండీఏ చేదా?

మొదటిపేజీ తరువాయి...

వెల్లువెత్తుతున్నాయి. సాధారణంగా ఉమ్మడి రాష్ట్రం సహా గత ప్రభుత్వాలు భూముల వేలం ప్రక్రియలో అనుసరించిన విధానాలకు భిన్నంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేసిన కసరత్తు ఈ సందేహాలకు బలాన్ని ఇస్తున్నది. ముఖ్యంగా భూముల విలువను తగ్గించడం మొదలు చరిత్రలో తొలిసారిగా టీజీఐఐసీ ద్వారా ప్రభుత్వం రుణం పొందడం వరకు చోటుచేసుకున్న పరిణామాలు అన్నింటినీ క్రోడీకరిస్తే కేవలం ఖజానాకు నిధుల సమీకరణ కోసమే 400 ఎకరాల భూముల విక్రయం అంశాన్ని ప్రభుత్వ పెద్దలు భుజానికి ఎత్తుకోలేదనే సంగతి వెల్లడవుతుంది. హైడ్రా అంటూ సామాన్యుడికి నిబంధనలను వల్లించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. పదుల సంఖ్యలో అనుమతులు తీసుకోవాల్సిన చోట.. రాత్రికి రాత్రి.. హడావుడిగా బుల్డోజర్లతో వేలాది చెట్లను నేలకూల్చడమంటేనే 'దాల్‌మే కుచ్ కాలాహై!' అనిపిస్తున్నది.

కంచ గచ్చిబౌలి భూముల వివాదంపై సుప్రీంకోర్టు జోక్యంతో తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఈ నేపథ్యంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఈ భూముల వెనక ఎలాంటి కసరత్తులు చేసింది.. ఎలా చేసింది.. ఇలా ఎందుకు చేసింది? అనే చర్చ తీవ్రస్థాయిలో ఊపందుకుంది. గత ఏడాది మార్చిలో 400 ఎకరాల భూములు ప్రభుత్వానివేనంటూ హైకోర్టు తీర్పు వచ్చిన తర్వాత నుంచి ఇటీవల సుప్రీంకోర్టు దాకా వివాదం వెళ్లే వరకూ జరిగిన పరిణామాలను చూస్తే ఈ భూములపై కాంగ్రెస్ ప్రభుత్వం టీజీఐఐసీ ద్వారా భారీ కసరత్తును చేసింది. సాధారణంగా ప్రభుత్వపరంగా భూముల వేలం అనేది కొన్ని దశాబ్దాలుగా తెలుగు రాష్ట్రాల్లో జరిగిందే. కానీ ఈ పరిణామాలు ముసుపెన్నడూలేని విధంగా ఉండటమే 400 ఎకరాల వెనక భారీ భూపందేరం దాగి ఉందనే ఆరోపణలకు తావిస్తున్నది. వాటిని ఓసారి పరిశీలిస్తే...

సందేహం-1: భూముల విలువ తగ్గించడమేంది?

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేనందున ఈ భూములను అమ్ముతున్నామని ఆది నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం చెప్తున్నది. ఈ క్రమంలో భూముల విలువ పెరిగితే ప్రభుత్వ ఖజానాకు నిధుల సమీకరణ పెరుగుతుంది. కానీ ప్రభుత్వ పెద్దలు అందుకు భిన్నంగా ఆలోచించడం సందేహాస్పదంగా మారింది. నిరుడు జూన్‌లో జారీ అయిన జీవో 54లో ఎకరం ధర రూ.75 కోట్లుగా నిర్ధారించిన అధికారులు అందుకు కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిన కోకాపేట, పరిసర ప్రాంత ప్రభుత్వ వేలం ప్రక్రియలను ఆధారంగా చూపారు. ఇది అక్షరాలా సత్యం అయినందున ఆ భూముల విలువ ఎంతో చెప్పేందుకు ఇంతకుమించిన సాక్ష్యం మరేదీ ఉండదు. కానీ రేవంత్ సర్కారు గత ఏడాది నవంబరులో పరిశ్‌రావు పన్సే-రావు అసోసియేట్స్ అనే ప్రభుత్వ అనుమతి ఉన్న వాల్యుయేషన్ సంస్థ ద్వారా తెప్పించుకున్న నివేదికలో ఏకంగా ఎకరాకు రూ.23 కోట్లు తగ్గడం అందరినీ విస్మయానికి గురిచేస్తున్నది. ఒకవేళ ఆ సంస్థ తూతూమంత్రంగా నివేదిక ఇచ్చిందనుకున్నా... గతంలో ప్రభుత్వ జీవోలోనే ఎకరం ధర రూ.75 కోట్లుగా నిర్ధారించినందున ప్రభుత్వ పెద్దలు వెంటనే అభ్యంతరం వ్యక్తం చేయాలి. కానీ ఇక్కడ అలా జరగకపోగా దాని ఆధారంగానే రూ.10వేల కోట్ల రుణం తీసుకురావడమంటే సర్కారు పెద్దల కనుసన్నల్లోనే ఇదంతా జరిగిందనేందుకు నిదర్శనం. అంటే ప్రభుత్వంలోని వారు ఈ భూముల ధరను ఎందుకు తగ్గించాలనుకున్నారు? దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు ఎలాగూ ప్రయోజనం ఉండదనేది అందరికీ తెలిసిందే. అలాంటప్పుడు ఈ తగ్గింపు ఎవరికి, ఏ రూపంలో లాభాన్ని చేకూరుస్తుంది?

సందేహం-2: జాతీయ బ్యాంకులను కాదని ప్రైవేటుకెందుకు?

సాధారణంగా ప్రభుత్వాలు బహిరంగ మార్కెట్లో రుణాలకు వెళ్లినప్పుడు జాతీయ బ్యాంకులను ఆశ్రయిస్తాయి. ప్రధానంగా ఎంతో విలువైన భూములను తనఖా పెడుతున్నందున సులువుగా ఎస్బీఐలాంటి జాతీయ బ్యాంకుల ద్వారా రుణాలు వస్తాయని ఆర్థిక రంగ నిపుణులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎస్బీఐలాంటి జాతీయ బ్యాంకులను కాదని ఐసీఐసీఐ వంటి ప్రైవేటు బ్యాంకును ఎందుకు ఆశ్రయించిందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకోసం మధ్యవర్తిగా బీకాన్ ట్రస్టీషిప్ అనే సంస్థ వ్యవహరించింది. అయితే 400 ఎకరాలను విక్రయించాలని నిర్ణయించిన ప్రభుత్వం అంతకు ముందే భూములను తనఖా పెట్టి రూ.10వేల కోట్ల రుణం ఎందుకు తీసుకుంది? పైగా రుణం తీసుకునే సమయంలోనే అమ్మాలనే ఆలోచన ఉందనేది అందులోని షరతులను చూస్తే అర్థమవుతుంది. ఎందుకంటే షరతుల్లో భాగంగా ఈ భూములను అమ్మి రుణాన్ని తిరిగి చెల్లించేందుకు వెసులుబాటు పెట్టుకున్నారు. అలాంటప్పుడు నేరుగా వేలం పాటకు వెళ్లకుండా ముందుగా రుణానికి పోవడమెందుకు? ఈ వ్యవధిలోనే భూ పందేరానికి సంబంధించిన అనధికారిక ఒప్పందాలను ముగించారనే ఆరోపణలు వినవస్తున్నాయి. పైగా ఒకే భూములపై రుణం-వేలం నిర్వహించాలనుకోవడం ఇదే తొలిసారి అని కూడా అధికారులు కొందరు చెబుతున్నారు.

సందేహం-3: నాడు కమీషన్లయితే... నేడు లోకకల్యాణమా?

కేసీఆర్ ప్రభుత్వం ఎడాపెడా అప్పులు చేసిందంటూ కోడైకూస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి సహా మంత్రులు, కాంగ్రెస్ నేతలు ప్రధానంగా కార్పొరేషన్ల ద్వారా రుణాలు తీసుకోవడాన్ని ఒక పెద్ద నేరంగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోకి రాకుండా ఉండేందుకు కాళేశ్వరం, ఇతరత్రా కార్పొరేషన్లను ఏర్పాటుచేసి రుణాలు తీసుకున్నారంటూ అసెంబ్లీలోనే కాదు మీడియా ముందు అనేకసార్లు ముఖ్యమంత్రి విమర్శించారు. కానీ 'తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ' ద్వారా రూ.10వేల రుణం తీసుకురావాలంటూ అదే నోటితోనే సీఎం అధికారులను ఆదేశించారు. పైగా కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జాతీయ ఆర్థిక సంస్థలు, జాతీయ బ్యాంకులతోనే ఒప్పందాలు చేసుకుంది. ముఖ్యంగా కేసీఆర్ హయాంలో జరిగిన ప్రక్రియలో కమీషన్లు అంటూ నిరాధార ఆరోపణలతో కాళేశ్వరం, విద్యుదుత్పత్తి కేంద్రాలపై న్యాయ కమిషన్లు వేసిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రైవేటు సంస్థలతో చేసిన లావాదేవీలు మాత్రం అత్యంత పారదర్శకమని జనం నమ్మాలా? ముఖ్యంగా కేసీఆర్ ప్రభుత్వం చేస్తే అప్పెలా అవుతుంది? రేవంత్‌రెడ్డి సర్కారు రుణం తెస్తే లోకకల్యాణం ఎలా అవుతుంది? అనే సూటి ప్రశ్నలు వస్తూనే ఉన్నాయి.

సందేహం-4: లేఅవుట్ అభివృద్ధికి ఇంత తతంగమెందుకు?

ఉమ్మడి ఏపీ సహా గత పదేండ్లలోనూ ఏనాడూ పరిశ్రమల మౌలిక వసతుల కల్పన సంస్థను పారిశ్రామికాభ